
మట్టికుండ.. నువ్వు సల్లంగుండ





హాని చేయదు.. ఆరోగ్యం చెడదు

వేసవిలో చల్లని నీరు తాగితే ఆ తృప్తే వేరు. ఫ్రిడ్జ్ నీరు ఎక్కువగా తాగొద్దనే అవగాహన ప్రజల్లో ఎక్కువగా పెరగడంతో అందరూ కుండల వైపు చూస్తున్నారు. సామాన్యుడి ఫ్రిడ్జ్ అయిన కుండలను కొనుగోలు చేయడానికి జనం ఆసక్తి చూపుతున్నారు. సహజసిద్ధంగా నీటిని చల్లగా మార్చి మన దాహార్తిని తీర్చే కుండలకు డిమాండ్ పెరిగింది. ఈ కుండ నీటిని తాగే ప్రతి ఒక్కరూ 'మట్టికుండ నువ్వు సల్లంగుండ' అని అనకుండా ఉండరు. – ఓల్డ్‌బోయిన్‌పల్లి



కుండలకు పెరిగిన ఆదరణతో మార్కెట్‌లోకి వివిధ రకాల ఆకృతులలో వచ్చి చేరాయి. ప్రజలు కూడా వాటిని ఇష్టంగా కొనుగోలు చేస్తుండటంతో వ్యాపారులు ఒక్కో కుండను రూ.100 నుంచి రూ.650 వరకు వరకు అమ్ముతున్నారు. బోయిన్‌పల్లి మార్కెట్, ఓల్డ్ బోయిన్ పల్లి చౌరస్తాతో పాటు ప్రధాన రహదారుల వెంట కుండలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. వినియోగదారులు ప్లేన్ కుండలనే కాకుండా పెయింటింగ్ చేసిన కుండలను ఇష్టంగా కొంటున్నారు. వివిధ రకాల ఆకృతుల్లో ఉండే కుండలను ధర ఎక్కువగా ఉన్నా కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ధర రూ.100 నుంచి రూ.650





క్లుప్తంగా

10వ తేదీ నుంచి జార్జిరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్వ విద్యార్థి పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి వర్ధంతి పురస్కరించుకొని వర్సిటీలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పీడీఎస్‌యూ నేతలు పేర్కొన్నారు. మంగళవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ నాయకులు ఎస్. నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 14న జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ స్పోర్ట్స్ లీగ్ పేరుతో ఈ నెల 10 నుంచి 12 వరకు వివిధ క్రీడాపోటీలు, 13న జార్జిరెడ్డి సినిమా ప్రదర్శన, 14న బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్ధంతి కార్యక్రమాలలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుమంత్, స్వాతి, రుక్మత్‌పాషా, చిరంజీవి, నరేష్, సాయికుమార్, క్రాంతి, మహేష్, మధులత, మనిదీప్, తరుణ్, సంధ్య, సృజన, వినయ్, రాజేష్ పాల్గొన్నారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు

అమీర్‌పేట: ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేసే మహిళను వేధిస్తున్న వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బల్కంపేటకు చెందిన ఓ మహిళ (33) ఓ స్కూల్లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. సోమవారం ఎస్ఆర్‌నగర నుంచి బల్కంపేటకు నడుచుకుంటూ వెళ్తుండగా బబ్లూ (30) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఆమెను వెంబడించి బెదిరింపులకు పాల్పడ్డాడు. వేగంగా బైక్ నడుపుతూ ఆమెను ఢీకొట్టేలా భయభ్రాంతులకు గురి చేశాడు. అంతేకాక ఇంటి వరకూ ఆమెను వెంబడించాడు. బాధితురాలు తన భర్తకు ఫోన్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

జన్మదిన శుభాకాంక్షలు



కూకట్‌పల్లి: వైఎస్ఆర్‌టీపీ అధికార ప్రతినిధి బి.సంజీవరావు జన్మదిన వేడుకలు కూకట్‌పల్లిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎస్సై శంకర్, బాలానగర్ ఎస్సై మన్యం, నాయకులు శ్రీధర్, డానియల్, జానీ, నాగేందర్‌బాబు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్‌తో వచ్చిన డబ్బుతో నిత్యావసరాలు



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బాలాజీనగర్ శ్రీ చైతన్య పాఠశాలలో సహాయ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు నిర్వహించిన ఫుడ్ కార్నివాల్‌లో వచ్చిన నగదుతో అక్కడ ఎంతోకాలంగా పనిచేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు, ఆయాలకు మంగళవారం కూకట్‌పల్లి జోన్ ఏజీఎం శివరామకృష్ణ ఆధ్వర్యంలో నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు సామాజిక సేవా కార్యక్రమాల పట్ల అవగాహన పెంచుతున్నామని అన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి జోన్ ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, ప్రిన్సిపల్ సునీల, డీన్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పురేందర్‌రెడ్డి దంపతుల షష్టిపూర్తి



పురేందర్‌రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

కూకట్‌పల్లి: వివేకానందనగర్ రామకృష్ణ వీధి అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి దంపతుల షష్టిపూర్తి వేడుకలు ఆయన నివాసంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి పాల్గొని ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... పురేందర్‌రెడ్డి రాజకీయంగా ఎంతో అవగాహన కలిగిన వ్యక్తి అన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, రామచంద్రరావు, సంజీవరెడ్డి, ఎర్రవెల్లి సతీష్‌రావు, కార్తీక్‌రావు, అరవింద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్, సుమిత్ర నగర్, బాగ్ అమీర్ కాలనీల్లో రూ.81.23 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణ పనులకు మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన, అగ్రగామి నియోజవకర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. అదే విధంగా వివేకానందనగర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవటం సంతోషంగా ఉందన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని అన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో ఎక్కడా రాజీ పడవద్దని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ గోవర్ధన్, ఏఈ ఆశ, జలమండలి అధికారులు డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రియాంక, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, సంజీవరెడ్డి, పెద్ద భాస్కర్‌రావు, నాయినేని చంద్రకాంత్‌రావు, రాంచందర్, ఆంజనేయులు, అల్లం మహేష్, శ్రావణిరెడ్డి, విద్యాసాగర్, రవి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వీసీ చాంబర్ వద్ద పోలీసుల మోహరింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ చాంబర్ కన్నా రాష్ట్ర మంత్రుల నివాసాలే నయమని పీహెచ్‌డీ విద్యార్థులు మండిపడ్డారు. పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తగ్గించాలని మంగళవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లగా అనుమతి లేదని పోలీసులు రెండు గంటల పాటు అడ్డుకున్నారని ఏఐఎస్ఎఫ్ నేత సత్య పేర్కొన్నారు. విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వీసీ ప్రొ.రవీందర్‌ను నియమిస్తే విద్యార్థులకు సమయం ఇవ్వకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల పట్ల వీసీ రవీందర్ అనుసరిస్తున్న విధానాలతో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందన్నారు.

ఓయూలో విద్యార్థి నేతల అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: కొత్త బోర్డు సభ్యులను నియమించాకే టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల రాత పరీక్షలు చేపట్టాలని ఓయూలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మకు శవయాత్ర జరిపిన విద్యార్థి నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం వర్సిటీ లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు శవయాత్ర చేసి దహనం చేయబోగ పోలీసులు అడ్డుకున్నారు. బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఓయూ జాక్ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి, అంబేడ్కర్, ప్రవీణ్, నవీన్, చందు, శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి ఓయూ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం



సీసీరోడ్ల పునురుద్ధరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలో దాదాపు 2 కోట్ల 50 లక్షల రూపాయలతో ఏపీ హెచ్‌బీ కాలనీ, ప్రగతినగర్, ముష్కిపేట్, కైత్లాపూర్‌లలో సీసీ రోడ్ల పునరుద్ధరణ పనులు, సీనియర్ సిటిజన్ భవనం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డివిజన్‌లో పైపులైన్ పనుల కారణంగా అక్కడక్కడ రోడ్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. డివిజన్‌లో పునరుద్ధరణ పనులు కూడా దాదాపు 90 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. అదే విధంగా డివిజన్‌లోని పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఇప్పటికే సిద్ధమయ్యాయని పేర్కొన్నారు.

- మహిళలు, చిన్నారులకు కూడా ప్రత్యేకంగా పార్కులు రూపొందించామని తెలిపారు. అతి త్వరలోనే వీటిని అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. వాటికి తగిన నిధులు మంజూరు చేసి పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, మాజీ కార్పొరేటర్ బాబూరావు, డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌గౌడ్, వెంకటేష్‌చౌదరి, అనితాశ్రీపాద్, అరుణ శెట్టి, బండి సుధా, ఎట్టయ్య, బి.ప్రతాప్ రెడ్డి, డా.వెంకట్‌రావు, ఆరోగ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంటీహిల్స్‌లో పీస్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లోని హెచ్ఎంటీహిల్స్ కమ్యూనిటీ హాలులో మంగళవారం పోలీస్ అధికారులు పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏసీపీ చంద్రశేఖర్, సీఐ కిషన్‌కుమార్, ఎస్సై రాజేందర్, వినయ్‌కుమార్, రామ్‌మోహన్‌రెడ్డి, మానిక రెడ్డిలతో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... అన్ని మతాల పండుగలు ఒకేసారి రావడం మంచి పరిణామమన్నారు. పండుగల్లో అన్ని మతాల వారు సోదరులుగా మెలగాలని కోరారు. ఎవరి ప్రలోభాలకు లొంగకుండా భవిష్యత్ దృష్ట్యా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ పోలీసులు, హైదర్‌నగర్ డివిజన్‌కు చెందిన అన్ని మతాల పెద్దలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరంలాంటిదని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. అంజయ్యనగర్, ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన భారతమ్మ, సుజాత అనారోగ్యంతో కొన్ని రోజులుగా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక సాయం కోసం వారు కార్పొరేటర్‌ను సంప్రదించారు. తక్షణమే స్పందించిన ఆయన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఒక్కొరికి రూ.60వేల చెక్కులు మంజూరయ్యేలా చూశారు. ఈ మేరకు మంజూరైన చెక్కులను మంగళవారం ఆయన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్‌యాదవ్, మేకల హరినాథ్, గడ్డం నర్సింగ్‌రావు, బుర్రి యాదగిరి, పిట్ల రాజు, అశోక్, చారి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించుకోవాల్సిన బాధ్యత మనదే

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బలగం సినిమాలో పాట పాడిన కళాకారులను సత్కరించి ఆర్థికసాయం చేస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: బలగం సినిమాలో ఒక పాట ద్వారా బంధాలు, బంధుత్వాలు, మానవీయ సంబంధాలను వారి గొంతుతో ఆవిష్కరించిన బుడగ జంగాల కళాకారులు మొగులయ్య, కొమురమ్మలను మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సత్కరించి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బలగం సినిమా ద్వారా వారి జీవితాల్లో మార్పు వచ్చిందన్నారు. ఒక పాటతో విచ్ఛిన్నమైన కుటుంబాలు కూడా కలుస్తున్నాయని పేర్కొన్నారు. వారి కళకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు. ఇలాంటి కళాకారులను ప్రోత్సహించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. దురదృష్టవశాత్తు మొగులయ్య ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడం విచారకరమని అన్నారు. మంత్రి హరీష్ రావు, ఎంతోమంది సినీ, రాజకీయ ప్రముఖులు కూడా వారికి అండగా ఉన్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మనకు తోచిన సాయం చేసి వారిని ఆదుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాత్ర పోషించిన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

టీ-సేవ్‌కు విద్యార్థి సంఘాల మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ: పార్టీలకు అతీతంగా ఏర్పాటుకు చేసిన టీ-సేవ్‌కు ఓయూ విద్యార్థి జేఏసీతో పాటు 20 సంఘాలు మద్దతు తెలిపినట్లు వైఎస్‌టీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు చక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట టీ-సేవ్ మద్దతు తెలిపిన విద్యార్థి నాయకులతో సమావేశమయ్యారు. విద్యార్థులు, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై ఉమ్మడిగా పోరాడేందుకు వైఎస్ఆర్‌టీపీ అధినేత్రి షర్మిల ఏర్పాటు చేసిన టీ-సేవ్‌కు ప్లకార్డులను ప్రదర్శిస్తూ స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీలో జరుగుతున్న అక్రమాలకు పోరాటాల ద్వారానే న్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అవినీతి అక్రమాలకు తావులేకుండా భవిష్యత్‌లో విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన ఉద్యమించేందుకు అన్ని సంఘాల నేతలు ఒకే గొడుగు కింద పోరాడేందుకు ముందుకురావాలని కోరారు. త్వరలో రాష్ట్రంలోని అన్ని వర్సిటీలలో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు

హాజరుకానున్న మంత్రి, మేయర్, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సీపీ

ఆల్విన్‌కాలనీ: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు బుధవారం ఎల్లమ్మబండలోని పీజేఆర్‌నగర్‌లో రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం డా. బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల అలంకరణ కార్యక్రమం, 10.30 గంటలకు సమావేశ స్థలంలో జ్యోతి ప్రజ్వలన, జయంత్యోత్సవ సభ ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షుడిగా ప్రభుత్వ విప్,శాసనసభ్యులు అరెకపూడి గాంధీ, ముఖ్యఅతిథిగా కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, గౌరవ అతిథులుగా మేయర్ గద్వాల విజయలక్ష్మి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీ రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, దేశపతి శ్రీనివాస్, ఏవీఎస్ రెడ్డి, సురభి వాణీదేవి, నవీన్‌రావు, ఎమ్మెల్యేలు వివేకానంద, మైనంపల్లి హనుమంతరావు, మాధవరం కృష్ణారావు, సుధీర్‌రెడ్డి, బేతి సుభాష్‌రెడ్డి, జెడ్పీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, డీవీఎంసీ మెంబర్లు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

7న సీతాఫల్‌మండిలో జాబ్‌మేళా

సికింద్రాబాద్: సెట్విన్ సంస్థతో పాటు మరిన్ని సంస్థల సహకారంతో ఈ నెల 7న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ జన్మదినాన్ని పురస్కరించుని టీఆర్ఎస్ నాయకులు సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో జాబ్ మేళాను ఏర్పాటు చేశారు. పదవ తరగతి నుంచి పీజీ, ఇంజినీరింగ్ తదితర వృత్తి విద్యాకోర్సులు చదివిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం 30 పేరొందిన సంస్థలను ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు. రూ.15 వేల కనీస వేతనం ఉంటుందన్నారు.

పండుగులను ప్రశాంతంగా జరుపుకోవాలి

– బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న పోలీసు ఉన్నతాధికారులు

భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌కేఎస్ఆర్ గార్డెన్‌లో బాలానగర్ డీసీపీ టి.శ్రీనివాసరావు, కూకట్‌పల్లి ఏసీపీ ఎ.చంద్రశేఖర్ మంగళవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. పవిత్ర రంజాన్, హనుమాన్ జయంతి, గుడ్ ఫ్రైడే వంటి పండుగలు ప్రజలు అందరూ సంతోషంగా జరుపుకోవాలని వారి సూచించారు. అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలన్నారు. ఒకరికి ఒకరు సహకారం అందించుకుంటూ ప్రశాంతంగా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు మహేందర్, సబిహాబేగం, నార్నే శ్రీనివాసరావు మాజీ కార్పొరేటర్ బాబూరావు, కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ నర్సింగరావు, ట్రాఫిక్ సీఐలు వై.నగేష్, కె.శేఖర్, కూకట్‌పల్లి అడ్మిన్ ఎస్సై కె.రామకృష్ణ, ఎస్సైలు టి.శంకర్, ఆర్.ప్రేమ్‌సాగర్, ఎం.కృష్ణయ్య పాల్గొన్నారు.

మోతీనగర్‌లో పాత పైపులైన్లను మార్చాలి

మోతీనగర్: మోతీనగర్ గ్రీవెన్స్, సపోర్టు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిశారు. మోతీనగర్‌లో రెండు వాటర్‌లైన్లు, ఒక డ్రైనేజీ లైన్ 30 సంవత్సరాల క్రితం వేశారన్నారు. ఇప్పుడున్న జనాభాకు అవి సరిపడటం లేదని ఆయన తెలిపారు. కొత్త పైపులైన్లు వేయాలని మంగళవారం ఎమ్మెల్యేకు మాజీ కౌన్సిలర్ సీహెచ్. సత్యనారాయణ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రీవెన్స్, సపోర్ట్ కమిటీ సభ్యులు ఊటుకూరి శ్రీనివాసగుప్తా, రమేష్ అయ్యంగార్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రీవెన్స్, సపోర్టు కమిటీ సభ్యులు

ఉద్యమకారుల మెప్పు పొందడానికే ఆత్మీయ సమ్మేళనాలు

- బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్
- ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో గడప గడపకు బీజేపీ



పాదయాత్రలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో గడప గడపకు చేపట్టి బీజేపీ కార్యక్రమం 5వ రోజు మంగళవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్, వెంకటపాపయ్యనగర్, ఉజ్జయిని మహంకాళినగర్, తంగరాజుబస్తీ, చంద్రమ్మ బస్తీ, పంచమి బస్తీ, పాపమ్మ బస్తీ, ఫోర్ట్ ఎస్టేట్ వంటి ప్రాంతాల్లో పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారని.. అభివృద్ధి యాత్ర పేరుతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తిరుగుతున్నారని విమర్శించారు. ప్రజల ముందు మీరు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఒక శ్వేత పత్రం ద్వారా ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. మేము చేపట్టిన గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో అనేక సమస్యలు స్థానిక ప్రజలు మా దృష్టికి తీసుకువస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా డ్రైనేజీ, మంచినీరు, రోడ్లు, వీధిలైట్లు, పింఛన్, రేషన్‌కార్డులు, డబుల్ బెడ్ రూం, పారిశుద్ధ్యం, దళితబంధు, షాదీముబారక్ ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు సరిగా అందడం లేదన్నారు. శేరిలింగంపల్లి ప్రజలు గుండెల్లో పెట్టుకొని కాపాడుకునే బాధ్యత తమపై ఉందని భరోసానిస్తూ పాదయాత్ర కొనసాగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అల్లూరి రామరాజు, నరేందర్‌రెడ్డి, కుమార్ యాదవ్, రవీంద్రరావు, కమలాకర్‌రెడ్డి, రఘు, రాజు, రామ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, సింగ్‌యాదవ్, రమేష్, శివ, చారి, నర్సింగ్‌రావు, గోపాల్‌రావు, అనిత, తదితరులు పాల్గొన్నారు.